పద్మశ్రీ వనజీవి రామయ్యకు మేయర్ పరామర్శ

వనజీవి రామయ్యను సత్కరిస్తున్న మేయర్ దంపతులు

ఖమ్మం, ఫిబ్రవరి 15: పద్మశ్రీ వనజీవి రామయ్యను కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, రామబ్రహ్మం దంపతులు పరామర్శించారు. రెడ్డిపల్లిలోని వనజీవి నివాసానికి గురువారం వెళ్లిన మేయర్ దంపతులు.. రామయ్యను పలు కరించి ఆరోగ్య, ఆర్థిక విషయాలు అడిగి తెలుసుకున్నారు. రామయ్య పెద్ద కుమారుడు సైదులు గతంలో తమ వద్ద డ్రైవర్‌గా పనిచేశారని గుర్తుచేశారు. నిరుడు జూలైలో గుండెపోటుతో అతడు మరణించడం విచారకరమని అన్నారు మీ కుటుంబానికి ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయంటూ రామయ్యకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వనజీవిని మేయర్ దంపతులు సత్కరించారు.

ఇంటూరి శేఖర్‌పై అవిశ్వాస తీర్మానం

డీసీవోకు తీర్మాన ప్రతిని అందజేసిన డీసీసీబీ డైరెక్టర్లు

డీసీవోకు అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న డైరెక్టర్లు

ఖమ్మం/కూసుమంచి, ఫిబ్రవరి 15: కూసుమంచి మండలం చేగొమ్మ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌పై సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. వారంతా కలిసి ఆ తీర్మాన ప్రతిని ఖమ్మంలోని సహకార శాఖ కార్యాలయంలోని డీసీవోకు గురువారం అందజేశారు. మొత్తం పదమూడు మంది డైరెక్టర్లకుగాను పదిమంది డైరెక్టర్లు తీర్మానానికి మద్దతు తెలుపుతూ డీసీవోకు తీర్మాన ప్రతిని అందించారు.

'టైం మేనేజ్‌మెంట్'పై ఎస్‌బీఐటీలో శిక్షణ

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15: 'టైం మేనేజ్‌మెంట్' అనే అంశంపై ఐసీటీ అకాడమీ, పే పాల్ సంయుక్తంగా ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం శిక్షణ కల్పిస్తున్నారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. సమయం చాలా విలువైనదని, సమయాన్ని సద్వినియోగించడం క్రమశిక్షణను నేర్పుతుందన్నారు. కరస్పాండెంట్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15: జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సులో 2019 సంవత్సరం నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీఐఈవో రవిబాబు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రుల్లో శిక్షణ పొందేందుకు రూ.వెయ్యి డీడీ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 26లోగా నూతన కలెక్టరేట్‌లోని డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

చేపల పెంపకానికి తెలంగాణ అనుకూలం

కూసుమంచి, ఫిబ్రవరి 15: చేపల ఉత్పత్తులకు తెలంగాణ రాష్ట్రం అనుకూలంగా ఉన్నదని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని ఒడిస్సా స్కూల్ ఆఫ్ ఫిషరీస్ రిసెర్చ్ వరకల్ ముండే, శాస్త్రవేత్త ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలేరులో మత్స్య పరిశోధనా కేంద్రంలో మూడు రోజుల పాటు జరిగే మత్స్య రైతుల శిక్షణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య అధికారి ఆంజనేయ స్వామి, శాస్త్రవేత్తలు శ్యాం ప్రసాద్ శాంతన్న, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నేటి బంద్‌ను జయప్రదం చేయండి'

ఖమ్మం కమాన్‌బజార్, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన సార్వత్రిక బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరసనగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఈ దేశవ్యాప్త సమ్మెను చేపట్టినట్లు చెప్పారు. నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఎంఎల్ పార్టీల నుంచి పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎర్ర శ్రీకాంత్, పోటు ప్రసాద్, గోకినపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. వివిధ పార్టీల నాయకులు కొత్త సీతారాములు, జానిమియా, ఆవుల వెంకటేశ్వర్లు, తుమ్మ విష్ణు, రామయ్య, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

బోనకల్లు, ఫిబ్రవరి 15: మండలంలోని గోవిందాపురం హైస్కూల్‌లో న్యూలక్ష్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ గోపి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించ్చని అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గరిడేపల్లి సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం ప్రభావతి, బాలస్వామి, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపులో ముందుండాలి

కల్లూరు, ఫిబ్రవరి 15: స్వయం సహాయక సంఘాల మహిళలు పొదుపులో ముందుండాలని స్త్రీ నిధి రీజనల్ మేనేజర్ రవీందర్ నాయక్ కోరారు. ఆయన గురువారం కల్లూరు మండల ఉషోదయ మహిళా సమాఖ్యలో స్వయం సహాయక సంఘాలతో సమావేశమయ్యారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి తదితరాంశాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం వెంకటరామారావు, సీసీలు, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

'సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి'

ఖమ్మం: సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కారేపల్లి: మాట్లాడుతున్న ఎస్సై రామారావు, తిరుమలాయపాలెంలో ఎంపీపీ, గిరిజన నాయకులు

ఖమ్మం, ఫిబ్రవరి 15: సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన వేడుకల్లో వారు మాట్లాడారు. గిరిజన సమాజానికి సంత్ సేవాలాల్ అమూల్యమైన సేవలందించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల హెచ్‌వోడీ జే.రమేశ్, ప్రొఫెసర్ సాంబశివరావు, నాయకులు, ఇతర ప్రముఖులు బానోత్ భద్రూనాయక్, పీఆర్ దేవి, నరేంద్ర, బట్టు రాజేంద్ర, ఉపేంద్రబాయి, పుల్లూరి నాగయ్య, జంగిపల్లి రవి, రవీంద్రనాయక్, మహేంద్రనాయక్, సురభి నాయక్, రమేశ్‌నాయక్, వీరన్ననాయక్, శ్రీనివాస్‌నాయక్, మణి, నాగలక్ష్మి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి, ఫిబ్రవరి 15: సంచార బంజారాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, వారికి ఆరాధ్యుడిగా మారిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను కారేపల్లిలో గిరిజనులు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో ఎస్ఐ పుష్పాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని వీ.ఎం.బంజర సోమ్లానాయక్ తండాలో గ్రామ పెద్ద బర్మావత్ మంగూనాయక్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నాయకులు ధర్మసోత్ దశరథ్ నాయక్, కృష్ణానాయక్, చిత్రయనాయక్, రాములునాయక్, రామ్‌సింగ్‌నాయక్, భాషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరులో..

వేంసూరు, ఫిబ్రవరి 15: మండలంలోని చోడవరం తండాలో జరిగిన వేడుకల్లో తహసీల్దార్ ఎం.ఎ.రాజు, ఎంపీవో రంజిత్‌కుమార్, ఎంఈవో చలంచర్ల వెంకటేశ్వరరావు, నాయకులు భూక్యా నాగులు, బాషా, నాను తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో..

కూసుమంచి, ఫిబ్రవరి 15: నేలకొండపల్లి మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో సంతు సేవాలాల్ జయంతిని జరుపుకున్నారు. ఉద్యోగులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 15: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సంత్ సేవాలాల్ జయంతిని జరిపారు. ఎంపీపీ బోడ మంగీలాల్, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్ తదితరులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీనిధి విద్యార్థులు


అమృత అశ్విత

మధిరరూరల్, ఫిబ్రవరి 15: ఈ నెల 12న ఖమ్మంలో జరిగిన ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సబ్ జూనియర్ ఎంపికలో మండలంలోని ఆత్కూరులోని శ్రీనిధి పాఠశాల విద్యార్థులు వీ అమృత, డీ అశ్విత ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ బీ అంజన్‌బాబు తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ చందు, వ్యాయామ ఉపాధ్యాయుడు కనకపూడి ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 15: మండలంలోని హస్నాబాద్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేకాధికారి బాలత్రిపుర సుందరి, మాజీ సర్పంచ్ భరత్ చంద్ర, ఎంపీటీసీ గుగులోత్ పాపానాయక్, కార్యదర్శి ఉషా, మాగి బాలకృష్ణ, పల్లి రమేశ్ పాల్గొన్నారు.

లాహిరి.. లాహిరి.. 'లహరి'లో...

హాయిగా ప్రయాణిద్దాం..!


ఆర్టీసీ స్లీపర్ కోచ్ బస్సు

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 15: 'లాహిరి.. లాహిరి.. లాహిరిలో.. ఓహో! జగమే ఊగెనుగా.. తూగెనుగా..!!' సినిమా పాటను ఎప్పుడైనా విన్నారా.. చూశారా..? రాత్రి వేళ, చంద్రుని చల్లటి వెలుగులో పడవ ప్రయాణపు అనుభూతిని వర్ణించే గీతమిది. మనందరికీ అలాంటి అనుభూతిని అందించేందుకు ఆర్టీసీ అవకాశం కల్పించింది. దాని పేరే 'లహరి'..! దూసుకెళ్తున్న బస్సు సీట్లో కూర్చుని, కాళ్లు బార్లా చాపుకుని, తలను వెనక్కు వాల్చి, కిటికీ నుంచి రివ్వున వీస్తున్న చల్లటి గాలిని ఆస్వాదిస్తూ, నిద్రాదేవి ఆవహించినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'మంచం' ఎక్కి నడుం వాలిస్తే..! ఏమాత్రం బడలిక లేకుండా, గమ్య స్థానానికి చేరుకుంటే.. ఆహా, ఎంత హాయిగా ఉంటుందో కదా..!! ఇంకెందుకు ఆలస్యం.. 'లహరి' ఎక్కేద్దాం పదండి...

సత్తుపల్లి-హైదరాబాద్ మధ్య స్లీపర్ కోచ్

సత్తుపల్లి డిపో నుంచి హైదరాబాద్ బీహెచ్ఎల్‌కు 'లహరి' పేరుతో స్లీపర్ కోచ్ బస్సును ఆర్టీసీ ప్రారంభించింది. దీని వివరాలను సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి బుధవారం 'నమస్తే తెలంగాణ'కు ఇలా వివరించారు. 'ఇది నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సు. సత్తుపల్లి డిపోకు రెండు బస్సులను ఆర్టీసీ యాజమాన్యం కేటాయించింది. ఇది ప్రతి రోజూ రాత్రి 11.15 గంటలకు సత్తుపల్లి నుంచి హైదరాబాద్ బీహెచ్ఎల్‌కు బయల్దేరుతుంది. హైదరాబాద్ బీహెచ్ఎల్ నుంచి ప్రతి రోజూ రాత్రి 9.00 గంటలకు ప్రారంభమవుతుంది. బస్సు దిగువ అంతస్తులో 33 పుష్ బ్యాక్ సీట్లు, పై అంతస్తులో 15 స్లీపర్ బెర్తులు (కుడి పక్కన ఐదు సింగల్, ఎడమ పక్కన 10 డబుల్) ఉన్నాయి. టికెట్ ధర సత్తుపల్లి నుంచి హైదరాబాద్ పుష్ బ్యాక్ సీటుకు రూ.550, బెర్త్‌కు రూ.650 ఉంటుంది. సత్తుపల్లి నుంచి బీహెచ్ఈఎల్‌కు పుష్ బ్యాక్ సీటుకు రూ.580, బెర్త్‌కు రూ.690 ఉంటుంది. సత్తుపల్లిలో బయల్దేరే సర్వీస్‌కు 8885, బీహెచ్ఎల్ నుంచి తిరిగొచ్చే సర్వీస్‌కు 8886 నంబర్ కేటాయించారు'. ఈ లహరి స్లీపర్ కోచ్ సదుపాయాన్ని సత్తుపల్లి ప్రాంత ప్రయాణికులు ఉపయోగించుకోవాలని రాజ్యలక్ష్మి కోరారు.

ఫుట్‌పాత్ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంలోని వైరా రోడ్డులో ఫుట్‌పాత్‌లను పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అధికారులు

ఖమ్మం, ఫిబ్రవరి 15: నగరంలోని ఫుట్‌పాత్ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి స్పష్టం చేశారు. నగరంలోని వైరా రోడ్డు, జడ్పీ సెంటర్, ఇల్లెందు రోడ్డు మార్గాల్లో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని షాపింగ్ మాళ్లకు ట్రేడ్ లైసెన్స్ ఉందోలేదో అనే విషయాలు పరిశీలించారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన ఫుట్‌పాత్‌ను కూడా పరిశీలించారు. ఫుట్‌పాత్‌ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలని తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఫుట్‌పాత్‌పై ఎటువంటి బోర్డులు పెట్టవద్దని, బైకులు నిలపవద్దని సూచించారు. ఫుట్‌పాత్‌లను అందరూ నడిచే విధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధులు సులభంగా ఎక్కి దిగేలా ఉండాలని అన్నారు. ఫుట్‌పాత్‌పై వాహనాలు తిరగకుండా బోర్డులు నిర్మించాలని సూచించారు. అలాగే, మొక్కలు బతికే విధంగా పాదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మాజీ సర్పంచులకు సండ్ర సన్మానం


సర్పంచులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు, ఫిబ్రవరి 15: ఇటీవల పదవీకాలం పూర్తిచేసుకున్న మండలంలోని సర్పంచులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం సన్మానించారు. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలా వెంకటరెడ్డి, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు సండ్ర పరామర్శ

వేంసూరు, ఫిబ్రవరి 15: మండలంలోని బీమవరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, గటిగంటి రాంబాబు, కొండపల్లి రాంబాబు, ఇనగడ్ల సత్యనారాయణ, వడ్లపూడి కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మందపాటి కుటుంబానికి..

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన గంగారం పీఏసీఎస్ అధ్యక్షుడు మందపాటి వెంకటరెడ్డి తండ్రి ముత్తారెడ్డి ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు. ముత్తారెడ్డి ముత్తారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీఆర్ఎస్ నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి రామారావు, కూసంపూడి మహేష్, గొర్ల సంజీవరెడ్డి, వల్లభనేని పవన్, తుంబూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మమతకు లైబ్రేరియన్ ఉద్యోగం

కూసుమంచి, ఫిబ్రవరి 5: గురుకుల బోర్డు ప్రకటించిన ఫలితాల్లో మండలంలోని ముత్యాలగూడేనికి చెందిన బొల్లికొండ మమత లైబ్రేరియన్ సైన్స్ విభాగంలో ఉద్యోగం సాధించింది. హైదరాబాద్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆమె నియామక పత్రాన్ని అందుకున్నది. ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగం సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు ఆమెను అభినందించారు.

సీహెచ్‌పీని సందర్శించిన జీఎం

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక సింగరేణి ఓసీలోని సీహెచ్‌పీని కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు గురువారం సందర్శించారు. సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ సోమశేఖర్‌రావు, ఎస్‌వో టు జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజినీర్ దుర్గాప్రసాద్, పీవో ఎంవి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

వైరా టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక బీసీ కాలనీ గ్రౌండ్‌లో 15 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు బహుమతులను స్పాన్సర్లు ఐలూరు జగన్మోహన్‌రెడ్డి, జనతా గ్యారేజ్ సోమవరం, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్, నాగసాయి కిరాణం నిర్వాహకులు అందించారు. టోర్నమెంట్ కన్వీనర్ మద్దెల సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు అస్వస్థత

కల్లూరు, ఫిబ్రవరి 15: కలుషిత ఆహారం కారణంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, వంట మనుషులు అస్వస్థులయ్యారు. మండలంలోని కృష్ణయ్యబంజరు అంగన్‌వాడీ కేంద్రంలో వండిన ఆహారాన్ని అక్కడి చిన్నారులు, సిబ్బంది తిన్నారు. వీరిలో చిన్నారులు గౌతమ్, పావన, వంట చేసిన చిన్ని కృష్ణ, ఆయా అంకిలికి వాంతులు అయ్యాయి. కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆహారం కలుషితమైన కారణంగానే వీరు అస్వస్థులైనట్లు సమాచారం.

అంగన్‌వాడీ ఆయాకు టీచర్‌గా ఉద్యోగోన్నతి

కారేపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని ఉసిరికాయలపల్లి చిట్యాలతండా అంగన్‌వాడీ కేంద్రం ఆయా లావుడియా శ్వేతకు టీచర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆమెకు ఉసిరికాయలపల్లి ఓసీ అంగన్‌వాడీ కేంద్రంలో పోస్టింగ్ ఇస్తూ నియామక పత్రాన్ని గురువారం ఐసీడీఎస్ సీడీపీవో కె.దయామణి అందించారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

బోనకల్లు, ఫిబ్రవరి 15: మండలంలోని ముష్టికుంట వద్ద అక్రమం గా ఆంధ్రా నుంచి ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై మధుబాబు గురువారం తెలిపారు. ఆంధ్రాలోకి ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మీదుగా తెలంగాణలోని బోనకల్లు మండలంలోని చొప్పకట్లపాలెం, ముష్టికుంట గ్రామాల మీదుగా ఇసుకను ఖమ్మం వైపు తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను సమాచారం మేరకు ఎస్సై మధుబాబు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరి గడ్డివాము దగ్ధం

కల్లూరు, ఫిబ్రవరి 15: మండలంలోని పోచవరంలో గురువారం వరి గడ్డివాము దగ్ధమైంది. చింతలపూడి మాధవరావుకు చెందిన పది ఎకరాల వరి గడ్డి పక్కనే కొందరు మంట వేశారు. దీంతో, నిప్పురవ్వలు ఎగిరి పడటంతో గడ్డివాముకు దగ్ధమైంది. మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పివేశారు. అప్పటికే వరి గడ్డి పూర్తిగా కాలి బూడిదైంది.

డీటీవోగా ఆఫ్రిన్ సిద్దిక్ బాధ్యతల స్వీకరణ

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న నూతన డీటీవో ఆఫ్రిన్ సిద్దిక్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 15: ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారిగా ఆఫ్రిన్ సిద్దిక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి డీటీవోగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ గౌస్ పాషా బదిలీపై మహబూబాబాద్ వెళ్లారు. పెద్దపల్లి డీటీవోగా ఉన్న ఆఫ్రిన్‌ను ఖమ్మం జిల్లాకు కేటాయించారు. కాగా, నూతన డీటీవోగా గురువారం ఆమె విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, అధికారులు, సిబ్బంది కలిసి ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికి ఆహ్వానించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె ఐడీవోసీకి వెళ్లి కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రవిబాబు

సత్తుపల్లి, ఫిబ్రవరి 15: సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన రవిబాబు, గురువారం ఖమ్మంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైరా కమిషనర్

వైరాటౌన్, ఫిబ్రవరి 15: కలెక్టరేట్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్‌ను వైరా మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వేణు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించారు.

బదిలీ కమిషనర్‌కు సన్మానం


బదిలీ మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

సత్తుపల్లి, ఫిబ్రవరి 15: బదిలీపై వెళ్తున్న సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ సుజాతను గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు సత్కరించారు. వైస్ చైర్‌పర్సన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు అమరవరపు విజయనిర్మల, మేకల భవాని, మట్టా ప్రసాద్, అద్దంకి అనిల్, గుండ్ర రఘు, చాంద్‌పాషా, నరుకుళ్ల శ్రీను, అమరవరపు కృష్ణారావు, చింతల సత్యనారాయణ, వల్లభనేని పవన్, రూత్ క్రిష్టియానా తదితరులు పాల్గొన్నారు.

'మిస్ట్'లో వర్క్‌షాప్

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 15: పట్టణంలోని కొత్తూరులోగల మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల(మిస్ట్)లో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మూడు రోజుల వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ గురువారం ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్ శ్రీసాయిచరణ్, ఇంజినీరింగ్ డీన్ జాకీర్ హుస్సేన్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎల్ఎస్.సాయి ఇంద్రసేనారెడ్డి, కన్వీనర్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 15: ఆర్థిక అక్షరాస్యతపై సత్తుపల్లి జేవీఆర్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, డీసీసీబీ సత్తుపల్లి బ్రాంచ్ సంయుక్తంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించాయి. డీసీసీబీ మేనేజర్ రజిత, కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి సారంగపాణి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పానెం రామచందర్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కల్లూరు, ఫిబ్రవరి 15: మండలంలోని చిన్నకోరుకొండి జడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను, అల్పాహారాన్ని గురువారం తోపుడు బండి ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ అందజేశారు. ఆయనకు ప్రధానోపాధ్యాయుడు వై.రమణ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్ అందజేత

వైరాటౌన్, ఫిబ్రవరి 15: స్థానిక ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్టును వైరా నివాసి రాయపూడి వెంకటేష్ గురువారం అందించారు. లయన్స్ క్లబ్ బాధ్యులు కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, వనమా వెంకటేశ్, హెచ్ఎం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి ఇంటూరి, మరో ముగ్గురు

కూసుమంచి, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని జీళ్ళచెరువు ఉన్న దేవాలయ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాల విషయంలో రిమాండ్‌లో ఉన్న ఇంటూరి శేఖర్, సీతారామచంద్ర స్వామి పాలక మండలి చైర్మన్ చెన్నా వెంకన్న, సభ్యులు కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణను పోలీసులు రెండు రోజుల పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. గురువారం కూసుమంచి పోలీస్ స్టేషన్‌కు తరలించి న్యాయవాది సమక్షంలో వారిని విచారించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

వైరా టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక సోమవరం గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామస్తురాలు గంధపు వరలక్ష్మి గురువారం సాయంత్రం ఆటోలో వైరా వస్తున్నది. ఆటో పక్క నుంచి వెళ్తున్న లారీ ఢీకొనడంతో ఆమె తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలోని మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ హఠాన్మరణం

కల్లూరు, ఫిబ్రవరి 15: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. వేంసూరు మండలం రామన్నపాలెం గ్రామస్తుడైన కాకాని శ్రీనివాసరావు(45) ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గురువారం సత్తుపల్లి నుంచి ఖమ్మం వరకు బస్సు నడుపుతున్నారు. కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు రాగానే ఛాతీలో నొప్పి రావడంతో బస్సును రోడ్డు పక్కన ఆపారు. నడుచుకుంటూ ఆసుపత్రిలోకి వెళుతూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. కాసేపటికే మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆసుపత్రిలో భర్త మృతదేహం వద్ద ఆయన యన భార్య రోదన.. చూపరులను కదిలించింది.

సమ్మెను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

పెనుబల్లి, ఫిబ్రవరి 15: నేటి సమ్మె/గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో పెనుబల్లిలో గురువారం మోటర్ సైకిల్ ర్యాలీ జరిగింది. నాయకులు చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, కొమ్మినేని సుధాకర్, బీరెల్లి లాజరు, చలమాల నరసింహారావు, గుడిమెట్ల బాబు, మద్దెల ఏసోబు, మేకతోటి కాంతయ్య, మిట్టపల్లి కిరణ్, పొట్లపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి, ఫిబ్రవరి 15: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గురువారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను వామపక్ష నాయకులు దగ్ధం చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

కావలెను

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **షేక్ సైదాబీ,** W/o: **షేక్ ఇమామ్, వయస్సు** : 23 సం॥లు, వృత్తి : గృహిణి, **నివాసం** : ఇ.నెం. 10-106, వెంగళరావునగర్, రోడ్డు నెం.6, అయ్యగారిపేట, సత్తుపల్లి, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా.గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.
షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రార్ మరియు జిల్లా పరిషత్ ఖమ్మం, వేంసూరు మండల పరిషత్, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా కల్లూరుగూడెం గ్రామ పంచాయితీ, కల్లూరుగూడెం గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా కల్లూరుగూడెం గ్రామములో వున్న ఖాళీ నివేశన స్థల సర్వే నెం. 72/ఈ/2/2/2 మింజుమలె 242 చ॥గ॥లకు సరియగు 202.34 చ॥మీ॥లు, **డాక్యుమెంట్ నెం. 77/2024** గల స్థలమునకు హద్దులు :**తూర్పు**: గిప్పపరిచిన వారి మిగులు స్థలము – ఆస్తి కొలత 78 అడుగులు, **దక్షిణం** : మర్లపాడు టూ తిరువూరు పోవు ఆర్ & బి రోడ్డు – ఆస్తి కొలత 27.93 అడుగులు, **పడమర** : తన్నీరు యేసు గారి స్థలము – ఆస్తి కొలత 78 అడుగులు, **ఉత్తరం** : గుంజ వీరయ్య గారి స్థలము, ఆస్తి కొలత 27.93.
జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616